క్లుప్తంగా

దివ్యాంగులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి: పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలోని శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ఓజీ కుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధు, ఆయన సోదరులు హరి, మాధవ అన్నదానం చేశారు. వారి తండ్రి జ్ఞాపకార్థం వారు దివ్యాంగులకు అన్నదానం చేసి స్వీట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో ఓంశక్తి అమ్మవారు

నగరి: స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి పూజలు గురువారం కూడా కొనసాగాయి. నవరాత్రి ఉత్సవాల మధ్యలో మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి పీఠం గురువులు బంగారు అడిగళార్ మృతిచెందడంతో రెండురోజుల పాటు ఆగిన ఉత్సవాలు తదుపరి కొనసాగుతూ వచ్చాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వేపాకులతో అలంకరించి భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన ఉభయదారులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అగస్తీశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం


ఉత్సవాలకు నాంది పలుకుతూ ధ్వజరోహణం

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ సమీపంలో గల స్వర్ణముఖనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వర స్వామివారి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు సందర్భంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం విభూది, చందనం, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. తదుపరి గణపతి హోమం చేపట్టి పూర్ణాహుతితో ముగించారు. అనంతరం భక్తుల చేతుల మీదుగా గోపూజ నిర్వహించారు. కలశ స్థాపన, మండపారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చేతుల మీదుగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి మాడవీధుల్లో సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రఘురామిరెడ్డి, మొగిలి వంశస్తులు, ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, హేమంత్‌స్వామి, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి ఆయుర్వేద సదస్సు


మాట్లాడుతున్న వైద్య దేవేందర్ త్రిగుణ

తిరుపతి కల్చరల్: అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళనం, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా, టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆదివారం మూడు రోజులపాటు ఆయుర్వేద పర్వం పేరుతో ఆయుర్వేద సదస్సులు, ప్రదర్శన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆలిండియా ఆయుర్వేదిక్ కాంగ్రెస్ ట్రస్ట్ అధ్యక్షుడు వైద్య దేవేందర్ త్రిగుణ తెలిపారు. ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి, సోవారిగ్పా వంటి వైద్య విధానాల ప్రాశస్త్యాన్ని, ప్రభావాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయాలని తుడా కార్యాలయంలో వెనుకనున్న కచ్చపి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఆయుర్వేద పర్వం కార్యక్రమంలో ప్రతి రోజు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఆయుర్వేద వైద్య విధానం, వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్, మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు మనోజ్, ఆయుర్వేదపర్వం చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీవీ ప్రసాద్, డాక్టర్ ఎ.శంకరబాబు పాల్గొన్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు

- క్రీడల్లో రాణిస్తున్న ఏకాంబరకుప్పం స్కూల్ విద్యార్థుల ప్రతిభ విద్యార్థులు
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


త్రోబాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. తగిన ప్రోత్సాహం ఉంటే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. నిరుపేద కుటుంబం, గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ తరఫున నిర్వహిస్తున్న పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో వాణిశ్రీ, సుకన్య, బాలుర విభాగంలో ఆకాష్, నందకుమార్ జిల్లా, అండర్-17 బాలికల విభాగంలో ఎస్ఎస్ బృంద, బాలుర విభాగంలో వి.రాకేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్రోబాల్, నెట్‌బాల్, షూటింగ్‌బాల్, కబడ్డీ ఇలా ఒక పాఠశాల నుంచే పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. రాష్ట్రస్థాయి పోటీల్లోను తాము ప్రతిభ చాటుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికౌతామని విద్యార్థులు తెలుపుతున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతా..



ఎస్‌జీఎఫ్ నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో ఈ ఏడాది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది జాతీయ స్థాయిలో ప్రతిభ కనభరచి జట్టు విజయానికి కృషిచేస్తాను.

–ఎస్ఎస్ బృంద, 10వ తరగతి

నన్ను గుర్తించారు..



పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయులు త్రోబాల్ నేను బాగా ఆడగలనని గుర్తించి నాకు శిక్షణ ఇచ్చారు. ఆ శిక్షణతోనే కుప్పంలో జరిగిన జిల్లాస్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచాను. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా రాణించగలనని నమ్ముతున్నా.

–నందకుమార్, 9వ తరగతి

మంచి తర్ఫీదు ఇస్తున్నారు ..



విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నదే నా ధ్యేయం. అందుకే రెండింటికీ ప్రాధాన్యత ఇస్తున్నాను. తల్లిదండ్రులు కూడా అందుకు సహకరిస్తున్నారు. పాఠశాలలోను చక్కని తర్ఫీదు అందిస్తున్నారు. ఇవే నెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడానికి సహకరించింది.

–కోమది, 9వ తరగతి

రెండు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతా..



త్రోబాల్‌లో, కబడ్డీలో జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. గతంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లోను రెండు పోటీలకు రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాను. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనభరచి జాతీయ స్థాయికి రెండు క్రీడల్లో ఎంపిక అవుతాను.

–రాకేష్, 10వ తరగతి

బాగా రాణిస్తా ..



త్రోబాల్ క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటాను. గత ఏడాది కూడా రాష్ట్రస్థాయి పోటీలు ఆడాను. ఆ అనుభవం ప్రస్తుత పోటీలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ఏడాది అత్యంత ప్రతిభచూపి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంటా.

–సుకన్య, 8వ తరగతి

మంచి ప్లేయర్ కావాలి..



నాకు నెట్‌బాల్ అంటే ఇష్టం. చాలా సంతోషంగా ఈ ఆటలో పాల్గొంటా. మంచి ప్లేయర్ కావాలని సాధన చేస్తున్నా. ఇప్పటికే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోను సత్తా చాటాలన్నది సాధన చేస్తున్నా.

–సాయికుమార్, 10వ తరగతి

షూటింగ్‌బాల్ అంటే ఇష్టం



నాకు షూటింగ్‌బాల్ అంటే ఇష్టం. మంచి ప్లేయర్ అవుతాను. మా అమ్మ,నాన్న కూడా ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రస్తుతం 10వ తరగతి కావడంతో చదువుకుంటూ తీరిక సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నా. రాష్ట్రస్థాయి టీంకు ఎంపికయ్యాను.

–కిషోర్‌కుమార్, 10వ తరగతి

రెండేళ్లుగా నేర్చుకుంటున్నా..



రెండేళ్లుగా త్రోబాల్‌లో శిక్షణ పొందుతున్నా. వ్యాయామ ఉపాధ్యాయులు బాగా శిక్షణ అందిస్తున్నారు. బాగా ప్రోత్సహిస్తున్నారు. ఆ ప్రోత్సాహంతోనే కుప్పంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనభరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ కూడా రాణించాలన్నదే నా ధ్యేయం.

–ఆకాష్, 9వ తరగతి

జాతీయ జట్టులో ఆడాలని..



నెట్‌బాల్ సాధన చేస్తున్నా. చిన్నతిప్పసముద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. జాతీయ జట్టుకు ఆడాలనేది నా కోరిక. సాధన కొనసాగిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి, జాతీయ జట్టుకు ఎంపిక అవుతా.

–భూపతి, 9వ తరగతి

ప్రోత్సాహమే కారణం ..



క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం కారణంగానే త్రోబాల్, నెట్‌బాల్ రాణించగలుగుతున్నా. ప్రస్తుతం పోటీలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అందించే కృషితోనే పోటీల్లో రాణించగలుగుతున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో త్రోబాల్, నెట్‌బాల్ క్రీడల్లో పాల్గొంటా. తప్పక ప్రతిభ కనభరుస్తా.

–వాణిశ్రీ, 8వ తరగతి

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్

కార్వేటినగరం: మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆకుల మంగమ్మ కుమారుడు భరత్‌కుమార్, నిఖిత దంపతులను చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ ఆశీర్వదించారు. గురువారం ఆయన సీడీ కండ్రిగ గ్రామానికి చేరుకుని పెళ్లిలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకుల మంగమ్మ కుటుంబంతో ఎన్నో ఏళ్లుగా తమకు అనుబంధం ఉందన్నారు. పార్టీలు వేరైనా తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీకేఎం పేట సర్పంచ్ గోవిందస్వామి, లక్ష్మీపతిరెడ్డి, వెంకటేష్, మునిమండడి, రాజారాం మండడి, సుబ్బయ్య, బుర్ర వెంకటేష్, మురళి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎన్‌ఎం మృతి


ప్రభావతి (ఫైల్)

గంగాధరనెల్లూరు: మండలంలోని వరత్తూరు ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న ప్రభావతి గుండెపోటుతో మరణించారు. మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన ప్రభావతి (50) వరత్తూరు ఏఎన్‌ఎంగా పని చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆమెకు గుండెనొప్పి రావడంతో వెంటనే వారి బంధువులు చిత్తూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించినట్లు తెలిపారు. ప్రభావతి భౌతిక కాయానికి తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, పీహెచ్‌సీ డాక్టర్లు దివ్య, ప్రశాంత్, పీహెచ్ఎన్ శాంతి, ఫార్మాసిస్ట్ రజియా సుల్తానా, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, వైద్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి


ప్రకృతి వ్యవసాయంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు విత్తనకిట్లు పంపిణీ చేస్తున్న పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించి నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. గురువారం ఎస్‌కేఆర్ పురంలో కృష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏటీఎం మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో కిచెన్ గార్డెన్ ఎలా చేసుకోవాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో చెరుకు సాగుచేసి తద్వారా ఉత్పత్తయ్యే బెల్లాన్ని తిరుపతి-తిరుమల దేవస్థానం వారు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతి ప్రకారం విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించే వారిపై అవగాహన కల్పించారు. అనంతరం సంఘ సభ్యులకు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. వరిపంటను ఆశించే చిన్న చిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దాన్ని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా రైతులకు కిచెన్ గార్డెన్ పెంచుకోవడానికి విత్తన కిట్లు పంపిణీ చేశారు.

వైభవంగా విరూపాక్షమ్మ పుష్పయాగం


ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో వెలసిన విరూపాక్షమ్మ అమ్మవారికి గురువారం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 కిలోల వివిధ రకాల పుష్పాలను ఉభయదాతలు వేణునాథరెడ్డి, తులసిల నివాసం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి అమ్మవారికి సుగంధ భరిత ద్రవ్యాలతో అభిషేకం చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదమంత్రోచ్చారణల నడుమ పుష్పయాగం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అమర్‌నాథ్‌రెడ్డి, మునిక్రిష్టారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

29 లోపు అభ్యంతరాలు తెలపండి

- వడమాలపేటలో 6,423 ఎకరాల్లో ఈక్రాప్ పూర్తి


పాదిరేడులో ఈక్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఓ

పుత్తూరు రూరల్: రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉన్న రైతులు ఈనెల 29వ తేదీ లోపు తెలపాలని వడమాలపేట వ్యవసాయాధికారి ఎ.వి జయకుమార్ తెలిపారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 2023 ఖరీఫ్ సీజన్‌కు గాను మొత్తం 2126 మంది రైతులకు చెందిన 6,423 ఎకరాల్లోని పంటల సాగుకు సంబంధించి ఈక్రాప్ పూర్తిచేసినట్లు తెలిపారు. గురువారం నుంచి అన్ని ఆర్బీకేల వద్ద ఈక్రాప్ ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి గ్రామ సభలను సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభల్లో ముసాయిదా జాబితాను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఉంటే, సవరణ కోసం మీ వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించాలని సూచించారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా అందజేయాలని కోరారు. ఈఏడాది ఖరీఫ్ ఈక్రాప్– సవరణ కోసం చివరి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 1న తుది జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందని, ఆ తర్వాత ఎలాంటి మార్పులకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

టర్ఫ్ పిచ్‌తో తొలి క్రికెట్ స్టేడియం


అధికారులకు సూచనలు చేస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీలో భాగంగా తిరుపతి నగరానికి తొలి టర్ఫ్ పిచ్‌తో కూడిన క్రికెట్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత స్పష్టం చేశారు. ఇంజినీర్లతో కలిసి ఆమె గురువారం క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. గొల్లవాని గుంట చెరువు అభివృద్ధి వాకింగ్ ట్రాకర్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ఎండీ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటివరకు క్రికెట్ ఆడేందుకు టర్ఫ్ పిచ్ అందుబాటులో లేదన్నారు. విషయాన్ని గుర్తించి క్రీడాకారులకు ఓ ఆధునిక క్రికెట్ స్టేడియాన్ని స్మార్ట్ సిటీ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. క్రికెట్ స్టేడియం చుట్టూ, చెరువు వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ సౌకర్యవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీరు చంద్రశేఖర్, డీఈ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష


సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామ రక్ష అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కుమార్తె, మహిళా నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని వేపంజేరి గ్రామ పంచాయతీలోని జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ వాసుదేవ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం చిరుధాన్యాలను విధిగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారిని మెరుగైన వైద్యచికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ద్వారా పంపిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి, సామాన్య ప్రజలకు చిరుధాన్యాల ఆవశ్యకతను తెలియజేయాలని కోరారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన కిట్లను, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ మండల కన్వీనర్ సురేంద్ర రెడ్డి, నాయకులు మగిమైదాస్, వైద్యులు డా.ప్రశాంత్, డా.షర్మిల, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


పాడి పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి యశశ్వి

పాలసముద్రం: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి యశశ్వి తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె రైతులకు పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామాల్లో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా వేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు, పిడుదు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నాగలాపురం: జిల్లాస్థాయి పోటీలకు నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాగలాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు గగన్ రాజ్, నందిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, సురేంద్ర, హెచ్‌ఎం కస్తూరయ్య, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వంగా కనక దుర్గాదేవి గ్రామోత్సవం


సత్యవేడు: గ్రామోత్సవంలో కనకదుర్గా అమ్మవారి ఊరేగింపు

సత్యవేడు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా సత్యవేడు వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాన్ని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విజయదశమి శరన్నవరాత్రుల సందర్భంగా సర్వమంగళాదేవి ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీర్చిన కనకదుర్గాదేవికి నవరాత్రులు ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు చేపట్టారు. శరన్నవరాత్రుల్లో శ్రీ బాల త్రిపురా సుందరిగా, శ్రీకాళికాదేవి, శ్రీ లలితాదేవి, శ్రీ రాజరాజేశ్వరి, శ్రీలక్ష్మి, శ్రీ అన్నపూర్ణదేవి, సరస్వతిదేవి, మహిషాసుర మర్దినిగా పలు రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావువీధి, గంగమిట్ట వీధి, దేవాంగపురం వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి మంగళ వాయిద్యాలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు వారి ఇళ్ల వద్ద అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. 101 కలశాలను భక్తులు అమ్మవారి ఊరేగింపు వెంట తీసుకొచ్చారు. సాయంత్రం నిమజ్జనం సందర్భంగా భక్తులు అమ్మవారి పాటలు పాడుతూ చెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా ప్రదోష పూజలు


నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవంగా ప్రదోష పూజలు జరిగాయి. ముందుగా నందీశ్వర స్వామికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ప్రదోష పూజలకు ఉభయదాతలుగా తిరుపతి జిల్లా, ముండ్లపూడి గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బాలాజి రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఉభయదారులకు ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేయించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

28న టీటీడీ స్థానిక ఆలయాల మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్ర గ్రహణంగా కారణంగా ఈనెల 28వ తేదీ శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాల తలుపులు మూసివేస్తారు. తిరిగి మరుసటి రోజైన ఆదివారం ఉదయం ఆలయాల తలుపులు తెరుస్తారు. ఈ నెల 29న వేకువ జామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామ స్వామివారి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో 28న రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరిగి 29న తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు.

శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం

శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 28న అన్నాభిషేకం జరుగనుంది. భక్తులకు అన్నలింగ ఉద్వాసన చేపట్టిన అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. శుద్ధి అనంతరం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సుగంధ ద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు. 28న సాయంత్రం 6.45 గంటలకు ఆలయ తలుపులు మూసి వేసి 29వ తేదీన ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

మేధస్సు పెంపుదలకు స్వర్ణప్రషన్


స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లను ఆవిష్కరిస్తున్న డాబర్ ఇండియా ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రపంచంలోనే అతి పెద్ద సైన్స్ ఆధారిత ఆయుర్వేద సంస్థ డాబర్ ఇండియా సంస్థ తయారు చేసిన ఒక విప్లవాత్మక పురోగతి ఉత్పత్తిగా స్వర్ణ ప్రషన్ టాబ్లెట్‌ను గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆ సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాబర్ ఇండియా సంస్థ గ్రూప్ ప్రాడక్ట్ మేనేజర్ సుమన్ ముఖర్జీ మాట్లాడుతూ అందరికీ సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణకై స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లను ఆవిష్కరించామన్నారు. ఈ స్వర్ణ ప్రషన్ మేధస్సును పెంపొదించడంతోపాటు రోగనిరోధక శక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయ పడుతుందన్నారు. ఈ స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లు పుట్టిన పిల్లల నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లలందరికీ వినియోగించవచ్చని తెలిపారు. శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు తిరుపతి తుడా కార్యాలయం వెనుకనున్న కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే 18వ ఆయుర్వేద పర్వంలో తమ డాబర్ సంస్థ భాగస్వామ్యమై ఆయుర్వేద వినియోగం, వాటి ప్రత్యేకతల గురించి సంస్థ అనుభవజ్ఞులు తెలియజేయనున్నారని తెలిపారు. డాబర్ సంస్థ ప్రతినిధులు వెంకటరాజు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.